## క్లుప్తంగా

### నేడు,రేపు ప్లాట్ల బహిరంగ వేలం

**తాండూరు టౌన్:** యాలాల మండలం కోకట్ పరిధిలోని హైదరాబాద్ రోడ్డు మార్గంలో గల మనోహ టౌన్ షిప్‌లోని ఓపెన్ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ ప్లాట్లను బహిరంగ వేలం వేయనున్నట్లు మండల పరిషత్ అధికారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం, శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఓపెన్ ప్లాట్ ధర చదరపు గజానికి రూ.7,500గా నిర్ణయించినట్లు వెల్లడించారు. కావున అవసరమైన వారంతా వేలంలో పాల్గొనవలసిందిగా కోరారు.

### భగీరథనీరు వృథా



పైపు పగిలి వృథాగా పోతున్న నీరు

**పెద్దేముల్:** మిషన్ భగీరథ పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండల తట్టెపల్లి గ్రామం ఎస్సీ కాలనీకి కొంత కాలంగా తాగునీరు సరఫరా నిలిచిపోయింది. దీంతో పంచాయతీ అధికారులు మిగితా వార్డులకు నీటి సరఫరా నిలిపివేసి, ఎస్సీ వాడకు కొత్తగా పైపులైన్ వేశారు. అనంతరం నీటి సరఫరా చేసేందుకు ప్రయత్నించగా.. పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. పగిలిన పైపులైన్‌ను పరిశీలించిన సంబంధిత అధికారులు.. మరమ్మతు చేసి, ఎస్సీ కాలనీకి నీటి సరఫరా చేస్తామని చెప్పారు.

### సీసీరోడ్డు ప్రారంభం

**దౌల్తాబాద్:** మండలంలోని నంద్యానాయక్ తండా, బిచ్చాల, దౌల్తాబాద్ గ్రామాల్లో గురువారం ఉపాధి పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల పనులను జెడ్పీటీసీ మహిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఉపాధి పథకం కింద రూ.2కోట్లు నిధులు మంజూరయ్యాయని, వాటిని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు భగవంతు, వెంకట్‌రెడ్డి, మంజులాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నిరుపయోగంగా నీటితొట్లు



పాత కొడంగల్‌లో..

**కొడంగల్:** నియోజకవర్గంలో గతంలో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. వేసవి కాలంలో ఆ తొట్లలో నీటిని నింపితే పశుపక్షాదులు నీరు తాగడానికి అనుకూలంగా ఉంటుందని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద వీటిని నిర్మించారు. అయితే గ్రామ పంచాయతీ సిబ్బంది వాటిల్లో నీరు నింపక పోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

### రేపు బొడ్రాయి ప్రతిష్ఠాపన

**దౌల్తాబాద్:** మండల కేంద్రంలోని కిందిమోసటి కాలనీలోని బలభీమసేన దేవాలయం దగ్గర ఈనెల 18న శనివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 17న శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు బొడ్రాయి ప్రతిష్ఠాపనకు పురోహితులు పూజలు చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి గ్రామస్తులందరూ హాజరుకావాలని కోరారు.

### టెంకాయల వేలం రేపు

**యాలాల:** మండల పరిధిలోని జుంటుపల్లి సీతారామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా టెంకాయలు, మిఠాయిల విక్రయానికి బహిరంగ వేలాన్ని ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని, ఆసక్తి గల వారు గంట ముందుగా నిర్ణయించిన డిపాజిట్ చెల్లించాలన్నారు. టెంకాయలు, మిఠాయిల దుకాణం నిర్వహించుటకు ముందుగా రూ.5 వేలను జుంటుపల్లిలో ఆంధ్రాబ్యాంకు(యూనియన్ బ్యాంకు) శాఖ నుంచి డీడీ తీసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆలయ ఈఓ ఫోన్ నంబర్ 94923 52809ను సంప్రదించాలని సూచించారు.

### ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

**పూడూరు:** దామగుండం రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పూడూరు గ్రామం నుంచి దామగుండం వరకు భాజాభజంత్రీలతో పల్లకీలో ఊరేగింపుగా తరలించారు. ఈ సందర్భంగా ఆలయంలో అఖండ దీపారాధన, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. 17న తెల్లవారు జామున అగ్నిగుండం నిర్వహించడం జరుగుతుందని ఆలయ పూజారులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు

- నేటి నుంచి మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి జాతర
- 11రోజుల పాటు వేడుకలు
- ముస్తాబైన ఆలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

**కొడంగల్ రూరల్:** భక్తుల ఆరాధ్య దైవం, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 11 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాల్లో స్వామివారు 17 వాహనాలపై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా 17 వాహనాలను సిద్ధం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో వైఖానస ఆగమ శాస్త్ర పద్ధతిలో ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించడం అనాదిగా వస్తోంది. ప్రతిరోజూ స్వామి వారి రెండు వాహనాలపై మాఢవీధుల్లో విహరిస్తారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో చిన్న శేష, పెద్ద శేష, హంస, వ్యాళీ, సింహ, కల్పవృక్ష, సర్వభూపాల, పల్లకి, గరుడ, హనుమంత, గజ, సూర్యప్రభ, చంద్రప్రభ, అశ్వ, రథం, తిరుచ్చి తదితర వాహనాలపై విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతి రోజూ ఉత్సవమూర్తులకు అభిషేకం, ఊంజల్ సేవ, ప్రత్యేక మండపంలో వేదం, నాథం, గానం, నృత్యం, బాలాజీ ఆడుతా - పాడుతా - తీయగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆడుతా, పాడుతా తీయగా కార్యక్రమాల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు దైవారాధనతో భక్తి పాటలపై నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరిస్తాయి.

**17నుంచి రోజువారి కార్యక్రమాలు**

17న కోవిలాళ్వర్ల తిరుమంజనం, 18న సేనాధిపతి ఉత్సవం, మృత్సంగహణం, అంకురార్పణం, 19న ధ్వజారోహణం తిరుచ్చి ఉత్సవం, పెద్ద శేష వాహనం, 20వ తేదీ ఉదయం చిన్న శేష వాహనం, సాయంత్రం హంస వాహనంపై స్వామివారు విహరిస్తారు. 21వ తేదీ ఉదయం సింహ వాహనం, సాయంత్రం వ్యాళి వాహనంపై, 22వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం సర్వభూపాల వాహనంపై, 23వ తేదీ ఉదయం మోహినీ అవతార ఉత్సవం, సాయంత్రం గరుడోత్సవం, 24వ తేదీ ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం వసంతోత్సవం, రాత్రి గజ వాహనంపై, 25వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై, 26వ తేదీ ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహన వీధి ఉత్సవంపై స్వామివారు విహరిస్తారు. 27వ తేదీ ఉదయం పల్లకీ ఉత్సవం, స్వామివారి చక్రస్నానం అనంతరం ధ్వజావరోహణం నిర్వహిస్తారు.



ముస్తాబైన ఆలయం

**తిరుమల నుంచి పట్టువస్త్రాలు**

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం గరుడోత్సవం. ఈ వేడుక 23వ తేదీ రాత్రి అంగరంగ వైభవంగా జరుగుతుంది. తిరుమల నుంచి అధికారులు పట్టు వస్త్రాలు తెచ్చి స్వామివారికి సమర్పిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారు ఊరేగింపుగా జాతర స్థలానికి చేరుకుంటారు. రాత్రి ఒంటి గంట సమయంలో లంకాదహనం నిర్వహిస్తారు.



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

# పెచ్చులూడి.. ఇనుప చువ్వలు తేలి

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

**బంట్వారం:** మండల కేంద్రం కోట్‌పల్లిలో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పెచ్చులు ఊడి, ఇనుప చువ్వలు తేలి.. ఎక్కడికక్కడ పగుళ్లు వచ్చాయి. చాలా కాలంగా నీరు లీకేజీ అవుతుండడంతో ట్యాంకుకు పూర్తిగా నాచుపట్టింది. ఈ ట్యాంకు నుంచే గ్రామానికి ఇప్పటికీ నీరు సరఫరా అవుతోంది. ఇలా శిథిలావస్థకు చేరుకున్న ట్యాంకుతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారికి పక్కనే ఈ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ఉండడంతో ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఈ ట్యాంక్ పరిసరాల నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, చిన్నారులు ఆటలు ఆడుతుంటారని, ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సత్వరమే ట్యాంక్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, ఏం చేసినా.. ఏదైనా ప్రమాదం జరగకముందే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన వాటర్ ట్యాంక్

# గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ

**పూడూరు:** గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని పరిగి సీఐ వెంకటరామయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని చీలాపూర్‌లో ఆన్‌లైన్ మోసాలు, బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. గ్రామాల్లో సీసీల ఏర్పాటు వలన నేరాలను అదుపు చేయవచ్చని, బ్యాంక్, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాదారులు తప్పని సరిగా హెల్మెట్‌ను ధరించాలని చెప్పారు. బాల్యవివాహాలను ప్రోత్సాహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ సంఘమేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

**కుల్కచర్ల:** పార్టీ శ్రేణులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. కామునిపల్లి గ్రామానికి చెందిన ఎర్రం రాజు అనే పార్టీ కార్యకర్త 5నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. గురువారం ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ బీమా రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉన్న కార్యకర్తలందరికీ.. పార్టీ బీమా (ఇన్సు రెన్స్) వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, సర్పంచ్ మైపాల్ రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ బాలయ్య, నాయకులు రాజప్ప, రఘు, పెద్ద నర్సింహులు, లక్ష్మయ్య, మొగులయ్య, రాజు స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని దోస్తున్న ప్రభుత్వాలు

- రాష్ట్రంలో దొరల పాలన
- ధరలను అదుపు చేయని కేంద్రం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రుణ మాఫీ
- జోడో యాత్రలో ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్

**తాండూరు టౌన్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ అన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని నగరేశ్వర గుడి, మోచీ గల్లీ, పాత కూరగాయల మార్కెట్, గంజ్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు దొందు దొందేనని, రాష్ట్రంలో కల్వకుంట్ల ఫ్యామిలీ ఖజానా లూటీ చేస్తుంటే, కేంద్రంలో కార్పొరేట్ శక్తులకు దేశ ఖజానాను ధారాదత్తం చేస్తోందని దుయ్యబట్టారు.

**నిర్లక్ష్యం వీడని కేంద్రం**

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో పూర్తిగా దొరల పాలనే కొనసాగుతోందని, ఏ ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాలేదని, కరెంటు, బస్సు చార్జీల మోత మోగుతోందని, పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా.. కేంద్రం నిర్లక్ష్యం వీడటం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు ఉత్తంచంద్, జనార్దన్ రెడ్డి, నర్సింహులు, నర్సిరెడ్డి, బస్వరాజ్, అలీమ్, మల్లికార్జున్ ప్రభాకర్ గౌడ్, నగేష్, సంతోష్, మెకానిక్ రాజు, భీమ్ శంకర్, రవికుమార్, హబీబ్‌లాలా, రియాజుద్దీన్, వరాల శ్రీనివాస్‌రెడ్డి, బషారత్, బంటు వేణు, జర్నప్ప, నవాజ్, షకూర్ పాల్గొన్నారు.



కొడంగల్: గ్రామాల్లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తాండూరు టౌన్: కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కాంగ్రెస్‌తోనే సమస్యల పరిష్కారం**

**కొడంగల్:** హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఆసిఫ్‌ఖాన్, నయీం, గిరిజన సంఘం నాయకులు తార్యానాయక్, అంబయ్య గౌడ్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

# రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత

**బషీరాబాద్:** విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతుకూలి కుటుంబానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు రూ.20 లక్షల బీమా చెక్కును అందజేసింది. బ్రాంచ్ మేనేజర్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం .. మండల పరిధి పర్వత్‌పల్లి గ్రామానికి చెందిన సునిత జూన్ 2022లో విద్యుదాఘాతంతో మృతి చెందింది. అయితే గతంలో బషీరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాత తెరిచిన మృతురాలు సునిత.. ఎస్‌బీఐ వార్షిక ప్రమాద బీమా చేశారు. ఆమె మరణించడంతో గురువారం బీమా మొత్తాన్ని ఆమె భర్త నర్సింహులు, కుటుంబ సభ్యులకు బ్యాంకు ఉన్నతాధికారులు సయ్యద్ యూసుఫ్, మాచన్న, మౌలాలి అందజేసినట్లు మేనేజర్ తెలిపారు. ఖాతాదారులు తప్పక ప్రమాద బీమా చేసుకోవాలని సూచించారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

# ఆర్టీసీ అధికారుల వేధింపులతోనే ఆత్మహత్య!

- మృతుడి కుటుంబీకుల ఆరోపణ
- సంస్థకు సంబంధం లేదంటున్న డీఎం

**తాండూరు టౌన్:** ఆర్టీసీ అధికారుల వేధింపుల వల్లే చిరు వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడని, అందుకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ డీఎం సమత ఛాంబర్ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండు పరిధిలో ఓ డబ్బాలో వ్యాపారం చేసుకుంటున్న చిరంజీవి అలియాస్ దేవయ్య జనవరి 17న ఆత్మహత్య చేసుకున్నాడు. అతని బలవన్మరణానికి సంస్థ అధికారులే కారణమంటూ మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తూ గురువారం ఆందోళనకు దిగారు. ఇందుకు బాధ్యత వహిస్తూ నష్టపరిహారంగా మరో ఏడాది వ్యాపారం చేసుకునేలా చిరంజీవి భార్యకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో డీఎం స్పందించినట్లు బాధితులు తెలిపారు. ఇదే విషయమై డీఎంను వివరణ కోరగా ఆత్మహత్య చేసుకున్న వ్యక్తితో సంస్థకు ఎలాంటి సంబంధం లేదని, అసలు లైసెన్స్‌దారుగా రవికుమార్ అనే వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. ఆ దుకాణంపై ఉన్న బకాయిలను చెల్లిస్తే, మరో ఏడాది పాటు అక్కడ వ్యాపారం చేసుకునేందుకు వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు.

# ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పూజలు నిర్వహిస్తున్న పండితులు

**నవాబుపేట:** ముబారక్ పూర్‌లో శివ నందీశ్వర నాగ, నవగ్రహ, బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం శాంతి పాఠం, మహాగణపతి పూజ, సామూహిక హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెపు బాలమణి, ఎంపీటీసీ దయాకర్ రెడ్డి, నాయకులు ఆనంద్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సర్వసభ్య సమావేశం నేడు

**బంట్వారం:** కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు గాను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా ఎంపీపీ కోరారు.

### ధారూరులో మోస్తరు వర్షం

**ధారూరు:** ధారూరు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

### ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ పరీక్షలు

**కొడంగల్:** ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. తెలుగు, హిందీ, ఉర్దూ పేపర్ ఎగ్జామ్ జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. 459మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 6మంది గైర్హాజరై.. 453 మంది పరీక్ష రాసినట్లు సీఎస్ పండరీ తెలిపారు.

### ప్రజల గుండెల్లో ‘దేశం’

**టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నర్సింహులు**

**పరిగి:** తెలంగాణ ప్రజల్లో గుండెల్లో టీడీపీ ఇప్పటికీ పదిలంగా ఉందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా గురువారం జాఫర్‌పల్లి, తొండుపల్లి, చిట్యాల గ్రామాల్లో పర్యటించి ‘దేశం’ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు హైదరాబాద్ ఇంత అభివృద్ధి చెందడానికి కారణం టీడీపేనన్నారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రయ్య, చేవెళ్ల పార్లమెంట్ అధ్యక్షుడు శుభాష్, మండల అధ్యక్షుడు నరసింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘కంటివెలుగు’కు విశేష స్పందన

**బంట్వారం:** కంటివెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని రాంపూర్ సర్పంచ్ అనితారెడ్డి చెప్పారు. కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించి మాట్లాడారు. 6 రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమం పూర్తి స్థాయిలో విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి పూజాషిండే, సూపర్‌వైజర్ శాంతకుమారి, రాంపూర్ ఏఎన్ఎం అంజలి, పంచాయతీ కార్యదర్శి లావారెడ్డి, ఆశ వర్కర్లు విజయ, అండాలు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


**వినియోగించుకోవాలి..**

**పెద్దేముల్:** కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శ్రావణ్‌కుమార్ చెప్పారు. పెద్దేముల్ మండల మంబాపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌తో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కంటివెలుగును ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కంటి పరీక్ష చేయించుకొని ఉచితంగా కళ్లద్దాలు, మందులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నవ్యశ్రీ, ఏఎన్ఎం కవిత, వార్డు సభ్యులు కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెద్దేముల్: శిబిరంలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

# రాబోయే ఎన్నికల్లో కాషాయానికే పట్టం



ఇంటింటికీ ప్రచారంలో ప్రజలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

- బీఆర్‌ఎస్‌ను గద్దె దింపడం ఖాయం
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్

**తాండూరు టౌన్:** రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాషాయానికే పట్టం కట్టనున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. గురువారం పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు చెప్పారు. అనంతరం మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు షాక్ ఇవ్వనున్నారని, మోదీ అమలు చేస్తున్న పథకాలను, తామే కొనసాగిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకుంటున్న విషయం ప్రజలకు పూర్తిగా అర్థమవుతోందని తెలిపారు. బీజేపీని అప్రతిష్ట పాల్జేయాలని సీఎం కేసీఆర్ ఎన్ని కుట్రలు చేసినా.. రాష్ట్ర ప్రజలు కమలం పార్టీకి అండగా నిలిచి.. బ్రహ్మరథం పడుతున్నారని ఆయన చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గద్దె దింపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ లలిత, కౌన్సిలర్లు బాలప్ప, శ్రీలత, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, కృష్ణ, పాండు, మహిపాల్, నరేందర్, సతీష్, సంగమేశ్వర్, చందు, ఉమాదేవి, ప్రహ్లాదరావు, శ్రీకాంత్ రెడ్డి, కిరణ్, నరేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.